క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మరిపెడ రూరల్: మాజీ ప్రజాప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని మండలంలోని ఉల్లెపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు భూక్య జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని భూక్యతండాలో ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తండాలను, గూడెంలను గ్రామ పంచాయతీలుగా చేసి సర్పంచ్, ఎంటీసీలుగా ఎన్నుకున్నారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలను అప్పులు తీసుకొచ్చి ఎంతో అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. కానీ అప్పులు పెరిగి ఆత్మహత్యలు చేసుకుంటున్నామే తప్పా చేసిన అభివృద్ధి పనులను ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

'రిజర్వేషన్ అమలు చేయకుంటే ఉద్యమం'

నెల్లికుదురు: బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్ల హామీ అమలు చేయకుంటే మరో బీసీ ఉద్యమం తప్పదని టీఆర్పీ పాలకుర్తి నియోజకవర్గ నాయకుడు వరిపెల్లి ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్ల హామీ అమలు చేయడం కాంగ్రెస్ పార్టీ బాధ్యత అన్నారు. కాని బీసీలకు చట్టబద్ధత లేకుండా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేశామని చెప్పి ఇప్పటికి అమలు కాకపోవడం బీసీ వర్గాల్లో తీవ్రస్థాయిలో ఆగ్రహాన్ని కలిగిస్తున్నారన్నారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సమాజం పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతుందన్నారు.

కాలుకు వల చుట్టుకొని వేటగాడి మృతి

బయ్యారం: చేపలు పట్టేందుకు వెళ్లిన వేటగాడి కాలుకు వల చుట్టుకోవడంతో నీళ్లలో మునిగి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన ఏప నాగేంద్రబాబు(25) గ్రామ సమీపంలో ఉన్న బయ్యారం పెద్దచెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలకు వల విసురుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుకు వల చుట్టుకొని నీళ్లలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేక పోవటంతో నీళ్లలో మునిగి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ పనులకు జీపీ ట్యాంకర్..!



మరిపెడ రూరల్: మరిపెడ మండలం బాల్నిధర్మారం గ్రామంలో కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.20లక్షలు మంజూరు అయ్యాయి. ఇట్టి పనులను ఓ కాంట్రాక్టర్ టెండర్ ద్వారా దక్కించుకుని భవన నిర్మాణ పనులు మొదలు పెట్టాడు. ఇందుకు గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ట్రాలీని నీటి సరఫరా కోసం కొద్దిరోజులుగా ఉపయోగించుకుంటున్నాడు. కాంట్రాక్టర్‌కు గ్రామ కార్యదర్శి స్వయంగా అప్పగించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని మొక్కలకు నీటిని అందించాల్సిన జీపీ ట్యాంకర్ ఓ ప్రైవేట్ వ్యక్తి పనులకు ఉపయోగించుకోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తున్నాయి. అదేవిధంగా జీపీ సిబ్బంది కూడా భవన నిర్మాణ పనులకు ఉపయోగించుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జీపీ ట్యాంకర్ దుర్వినియోగంపై చర్యలు చేపట్టాలని బాల్నిధర్మారం గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టణ కమిటీ ఎన్నిక

నెహ్రూసెంటర్: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మహబూబాబాద్ పట్టణ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరికుంట్ల నాగన్న, కార్యదర్శిగా మనోహర్, కోశాధికారిగా దాసరి మనోహర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గీత కార్మిక సంఘం..

చిన్నగూడూరు: మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర నాయకుడు గునిగంటి మోహన్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా బత్తిని రమేశ్, గౌరవ అధ్యక్షుడిగా వేణుగౌడ్, ముఖ్య సలహాదారులుగా కొమిరెల్లి, నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీను ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, సహాయ కార్యదర్శిగా కృష్ణ, ఆర్గనైజర్‌గా వెంకన్న, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామానికి చెందిన ముత్యం రమేశ్(42) అనే వ్యక్తి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుమార్తె స్పందన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది.

సమస్యలతో తండా సతమతం



చేతి పంపు చుట్టూ చెత్తాచెదారం



నల్లాలబావిలో వ్యర్థాలు



వెలగని విద్యుత్ దీపం



బురదతో పాఠశాలకు వెళ్లే దారి

- అడ్డాసికుంటతండాలో మౌలిక వసతులు కరువు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల అడ్డాసికుంటతండాలో గిరిజనులు సమస్యలతో సతమతమవుతున్నారు. తండాలో సుమారు 40నుంచి 50వరకు ఇళ్లు ఉండగా 200 మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. పూర్తిస్థాయిలో గిరిజనులు నివాసం ఉండే అడ్డాసికుంట తండాలో ప్రతి ఒక్కరూ వ్యవసాయ, కూలీ పనులకు వెళ్తే గాని కుటుంబం గడిచే పరిస్థితి ఉండదు. అలాంటి తండాలో మౌళిక వస్తువులు కరువై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తండాలో వీధి దీపాలు వెలిగిన దాఖలాలు లేవు. తాగునీరు సక్రమంగా రావడంలేదని, ఐదు నుంచి ఆరు రోజులకు ఒకసారి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా తండా పరిధిలో ఉన్న నల్లాల బావిలో చెత్తాచెదారం పెరిగిపోయి దుర్గంధం వెదజల్లుతుందని, ఆ బావికి అమర్చిన విద్యుత్ మోటారు కనిపించకుండా పోయిందని తెలిపారు. తండాలో ఉన్న ఒక చేతికి పంపు నుంచి ఇనుపవాసనతో కూడిన నీళ్లు వస్తున్నాయని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడం వల్ల చేతి పంపు నీరు తాగాలంటే ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. తాగునీటి సరఫరాలో లోపం తలెత్తడం వల్ల వ్యవసాయ బావుల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుని తాగుతున్నామని తెలిపారు. తండాలో సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించాలి



ఓట్లప్పుడు వచ్చి నాయకులు ఓట్లు వేయించుకుని, ఆ తర్వాత మమ్ముల్ని పట్టించుకోరు. మా తండాలో రోడ్లు మంచిగా లేవు. కరెంటు లైట్లు వెలగడం లేదు. మంచినీళ్లు సక్రమంగా రావటం లేదు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ ఉండిపోతుంది. సార్లకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించి మమ్మల్ని ఆదుకోవాలి.

\- గుగులోతు బుజ్జి, స్థానికురాలు

జాతీయ భావాలు పెంపొందించడమే లక్ష్యం



వేడుకల్లో పాల్గొన్న సమితి ప్రతినిధులు

గూడూరు: మహిళలలో జాతీయ భావాలు పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర సేవికా సమితి పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ ఖమ్మం విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ కవిడి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని అరవింద విద్యాలయంలో శనివారం రాష్ట్ర సేవికా సమితి గూడూరు శాఖ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రేరణతో 1936లో వందనీయ లక్ష్మీబాయి కేల్కర్ విజయదశిమి రోజు రాష్ట్ర సేవికా సమితిని ప్రారంభిచారని తెలిపారు. ఆ తరువాత దేశ నిర్మాణంలో పురుషులతోపాటు మహిళలకు సమానమైన బరువు బాధ్యతలు ఉన్నాయని గుర్తించారు. హిందూ సమాజం నేడు కులమత కోట్లాటలతో మునిగిపోతున్న తరుణంలో కలిసి ఉంటే కలదు సుఖం అన్న అంశంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవికా సమితి జిల్లా కార్యవాహిక పింగిళి స్వరూపారాణి, అరవింద విద్యాలయ కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్, సేవికా సమితి మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

పడవలో వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



స్తంభం వద్దకు పడవలో వెళ్తున్న విద్యుత్ సిబ్బంది

కురవి: చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంపై పిడుగు పడి ఇన్సులేటర్లు ధ్వంసం(కాలిపోవడంతో) కాగా శనివారం సీరోలు మండల కేంద్రంలో విద్యుత్ సిబ్బంది పడవలో వెళ్లి విద్యుత్ పునరుద్ధరించి శభాష్ అనిపించుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో సీరోలు మండల కేంద్రంలోని చెరువు మధ్యలో ఉన్న 33 కేవీ మరిపెడ -1 ఫీడర్ స్తంభంపై పిడుగు పడడంతో మూడు ఇన్సులేటర్లు కాలిపోయాయి. దీంతో సీరోలు మండల ఏఈ సునీల్ కుమార్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది సమస్యను గుర్తించారు. మూడు ఇన్సులేటర్లు కాలిపోవడంతో గ్రామానికి చెందిన గోనెల వెంకన్న సాయంతో పడవను తెప్పించారు. లైన్‌మెన్‌లు శ్రీనివాస్, వీరన్న సూచనలతో ఏఎల్ఎంలు శ్రీనివాస్, హరిప్రసాద్, అన్‌మ్యాన్డ్ కార్మికులు జాగీర్, కస్నాలు పడవలో చెరువులోని స్తంభం వద్దకు వెళ్లి మరమ్మతులు చేశారు. సీరోలు గ్రామస్తులు, విద్యుత్ శాఖ అధికారులు వారిని అభినందించారు.

గుంతలు పడుతున్న బీటీ రోడ్డు



గుంజేడు ఆలయ సమీపంలో దెబ్బతిన్న రోడ్డు



గ్రామంలో గుంతలు పడిన రోడ్డు

కొత్తగూడ: మండలకేంద్రం నుంచి గుంజేడు జాతర వరకు ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.రెండు కోట్ల నిధులతో సుమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణం జరిగి ఆరునెలలు గడవక ముందే బీటి లేచిపోయి గుంతలు పడుతోందని ప్రయాణికులు తెలిపారు. కొత్తగూడ, గంగారం మండలాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి బాగుండాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్డు నిర్మాణ పనులు చేయించారు. రోడ్డు నిర్మాణం చేసి ఆరునెలలు పూర్తి కాక ముందే బీటీ దెబ్బతిని గుంతలు అవుతుందని స్థానికులు తెలిపారు. కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడం, బీటీ వేసి సైడు బర్మలు పోయక పోవడం వల్లనే రోడ్డు దెబ్బతింటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినక ముందే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. కాగా ఈఏడాది కురిసిన అధిక వర్షాల కారణంగానే రోడ్డు దెబ్బ తిన్నట్లు ఆర్అండ్‌బి అధికారులు అంటున్నారు.


శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న కన్వీనర్ అనిల్

తొర్రూరు: విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యమని ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 7 రోజుల ప్రత్యేక శిబిరం శనివారం డివిజన్ కేంద్రంలోని ఎస్టీ బాలికల వసతిగృహ ఆవరణలో ప్రారంభమైంది. ఎస్సై శివరామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మునుకుంట్ల యాదలక్ష్మిలతో కలిసి జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ అనిల్ మాట్లాడారు. సామాజిక సేవకు ప్రతిరూపం ఎన్ఎస్ఎస్ అని, ప్రత్యేక క్యాంపులతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆరిగకూటి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మాధవీలత, ప్రతినిధులు ప్రవుల, రజిని, స్రవంతి, తండా హరీశ్, జర్నలిస్టులు లకావత్ యాదగిరినాయక్, జిలుకర రాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



వెంకయ్య

చిన్నగూడూరు: కుటుంబ కలహాలతో వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని మన్నెగూడెం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన మెట్టు వెంకయ్య ఇంట్లో కుటుంబ కలహాలతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుపక్కల వారిని ఆరా తీసినా ఎక్కడ ఆచూకీ లభించలేదు. శనివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభ సులోచన అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీలతో పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, ప్రభుత్వాల ఆలోచనలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలన్నారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభ సందర్భంగా వివిధ యూనియన్‌ల నుంచి సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్‌లో పలువురు చేరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ధార స్నేహబిందు పాల్గొన్నారు.

తట్టుపల్లి పంతులమ్మ ఇకలేరు



రాధాలక్ష్మి (ఫైల్)

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో విద్యా వెలుగులు నింపిన ఆదర్శ ఉపాధ్యాయురాలు(పంతులమ్మ) కాటిపాముల రాధాలక్ష్మి(95) అనారోగ్యంతో శనివారం వరంగల్‌లో కన్నుమూశారు. తట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించి అదే పాఠశాలలో పదవీ విరమణ పొంది గ్రామ ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారు. రాధాలక్ష్మి మృతి చెందడంతో తట్టుపల్లి విషాదం అలుముకుంది. ఆమె మృతి తీరనిలోటని పూర్వ విద్యార్థి, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు, టీపీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డీవై గిరి ఆమె కుటుంబానికి సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. కొడుకు శేషగిరిస్వామి గతంలోనే మృతి చెందాడు. కుమార్తెలు ఎస్సై శాంతాదేవి, కృష్ణవేణి ఉన్నారు.

అశ్వవాహనంపై పారువేటకు స్వామివారు



పారువేటకు బయలుదేరిన వేంకటేశ్వరస్వామి

గార్ల: మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం స్వామివారిని అశ్వవాహనంపై పారువేటకు దేవాలయం సమీపంలోని అడవికి బయలుదేరారు. పారువేటలో మర్రిగూడెం గ్రామ చివరకు వెళ్లి స్వామివారు బొడ్డులో ఉన్న తన కత్తితో గొర్రెపోతు చెవు కోసి తిరిగి మర్రిగూడెం దేవాలయం చేరుకుంటారు. అనంతరం దేవాలయంలో స్వామివారికి పూర్ణాహుతి కార్యక్రమంను అర్చకులు అచ్చుతాచార్యులు, గోవిందచార్యులు, రఘువెంకట రామస్వామి, ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ గూడూరు సంజీవరెడ్డి, ఐఆర్‌టీఎస్ రిటైర్డ్ అధికారి భూక్యా కస్నా నాయక్, మాజీ ఎంపీపీ బి.లాలునాయక్, బోజ్యా నాయక్, చిరంజీవి, కోట శ్రీనివాస్, సత్యం, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని బలోపేతం చేద్దాం..



నారాయణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు, ఎస్టీఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నాగటి నారాయణ స్ఫూర్తితో ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాన్ని బలోపేతం చేద్దామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో శనివారం నాగంటి నారాయణ వర్ధంతి వేడుకలు పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. నారాయణ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలుపెరుగని పోరాటం చేసి, ఎన్నో హక్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, జిల్లా కార్యదర్శులు హుస్సేన్, మంజుల, హరినాయక్, ఆడిట్ కన్వీనర్ సంజీవ మండలాల బాధ్యులు కుమార్, రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మరిపెడ రూరల్: మాట్లాడుతున్న ఏఎస్సై మంగ్యానాయక్

మరిపెడ రూరల్: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై మంగ్యానాయక్ విద్యార్థులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్సై హాజరై మాట్లాడారు. తెలియన ఫోన్ కాల్స్, ఓటీపీలపై అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్ట్ అంటూ నేరగాళ్లు కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి మోసాలను గ్రహించాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డ వ్యక్తులు వెంటనే పోలీస్‌లకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఉమారాణి, అధ్యాపకులు వీఎం లక్ష్మీప్రసన్న, విజయశాంతి, సరిత, కవిత, గోపి, శ్రీనివాస్, సంతోష్, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అండగా షీటీం..

గూడూరు: చదువుకునే విద్యార్థులకు, మహిళలకు ఆపద సమయంలో షీటీం పోలీసులు పనిచేస్తారని, అండగా ఉంటారని ఎస్సై బి.రాజమౌళి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఆకతాయిల వేధింపులను అరికట్టడానికి షీటీం పోలీసులు పని చేస్తారన్నారు. ఆపద సమయంలో 100, 1930 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంధన్, కానిస్టేబుళ్లు రవి, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అఖండ భజన ముగింపు

మహబూబాబాద్ రూరల్: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా మానుకోట శ్రీసాయి మందిరంలో జరుగుతున్న వంద గంటల నామసంకీర్తన, అఖండ భజన ఆదివారం సాయంత్రం 6గంటలకు ముగుస్తుందని భగవాన్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఇమ్మడి చంద్రప్రకాష్, సాయి మందిర సేవా ట్రస్ట్ చైర్మన్ వందనం కమల్ కుమార్, కోశాధికారి బొడ్డ రామకృష్ణ శనివారం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ధన్ ధాన్య కృషి యోజనపై అవగాహన



కేసముద్రం: ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన, పప్పు ధాన్యాల స్వావలంబన మిషన్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శనివారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మార్కెట్ అధికారులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రకు విద్యార్థులు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ముదిరెడ్డి రమాదేవి, ముదిరెడ్డి మురళీధర్‌రెడ్డి, రావుల శ్రీనాథ్‌రెడ్డి సహకారంతో మహబూబాబాద్ ఆర్టీసీ ద్వారా రామప్ప, లక్నవరంకు శనివారం విజ్ఞాన యాత్రకు బయలుదేరారు. కార్యక్రమంలో టూర్ ప్యాకేజ్ ఆఫీసర్ ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ బాటిల్స్ అందజేత

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని బాలికలకు కురవికి చెందిన వందన గ్యాస్ ఏజెన్సీ గోలి అశోక్ కుమారుడు అఖిల్ వర్ధంతి సందర్భంగా ఉచితంగా స్టీల్ వాటర్ బాటిల్స్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్ జానీ, ఎస్ఓ సరస్వతి, కల్ల వెంకటరెడ్డి, ప్రశాంత్, వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరికి పాముకాటు

గంగారం: బహిర్భూమికి వెళ్లిన ఒకరికి పాము కాటువేసిన సంఘటన మండలంలోని మడగూడెం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గంగారం మండలంలోని మడగూడెం గ్రామానికి చెందిన సుంచ భద్రయ్య రాత్రి బహిర్భూమికి వెళ్లాడు. ఈక్రమంలో పాము కాటు వేసింది. వెంటనే స్థానికులు గమనించి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్: అనేక అనారోగ్య సమస్యలతో మృతి చెందుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెర్లపాలెం, పత్తేపురం, తొర్రూరు పట్టణంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు పెరటి యాకుబ్‌రెడ్డి, హనుమాండ్ల నరేందర్‌రెడ్డి, ఎక్కటి నాగిరెడ్డి, జినుగ రవీందర్‌రెడ్డి, బీరెల్లి మహేందర్ రెడ్డి, ధర్మారపు మహేందర్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

పాలకుర్తి టౌన్: బీసీ రిజర్వేషన్ల పై బీఆర్ఎస్ నాయకులు అసత్యప్రచారం మానుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు రాజ్యాధికారం అంశంలో బీఆర్ఎస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించలేమన్న భావనతో బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ కారుపోతుల శ్రీనివాస్, పోగు శ్రీనివాస్, ఎండీ మదార్, సలీం, పెనుగొండ రమేష్,బొమ్మగాని భాస్కర్, నలమాస రమేష్, పన్నీరు వెంకన్న, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నర్సంపేట: హ్యూమన్ రైట్స్ నర్సంపేట నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా బర్ల దేవదాస్, చెన్నారావుపేట మండల ముఖ్య సలహాదారుగా పర్కాల కొమురయ్య నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాస్‌కు, కొమురమ్మకు డివిజన్ ఇన్‌చార్జ్ నర్మెట యాదగిరి, డివిజన్ కన్వీనర్ సాదు నర్సింగరావు శనివారం నియామక పత్రాలు అందించి మాట్లాడారు. అవినీతి, అక్రమాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆకులపెల్లి ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు'

పాలకుర్తి టౌన్: స్వాతంత్ర్యం వచ్చి చాలా ఏళ్లు గడిచినా, ఇప్పటికీ జనాభాపరంగా మేమెంతో మాకంత వాటా ఇవ్వకుండా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తూన్నాయని మోకు దెబ్బ రాష్ట్ర నాయకుడు కమ్మగాని వెంకన్న ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో అయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుల గణన సర్వేలో బీసీలు 56 శాతం ఉన్నా 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో విఫలయమ్యారని అన్నారు. ఈడబ్ల్యూ రిజర్వేషన్ల అమలు చేయడం కోసం కాంగ్రెస్, బీజేపీలు కేంద్రంలో ఒక్కటై ఆమోదించుకున్నా, బీసీ రిజవ్వరేషన్ల కోసం ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ బీసీ సమాజానికి తీరనిద్రోహం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాజకీకయాలు మానుకొని కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, లేకపోతే జరగబోయే పరిణామాలకు రెండు పార్టీలు జవాబు చెప్పాల్సి వస్తుందని అన్నారు.